విద్యార్థులకు బుక్స్, వసతి గృహానికి కిచెన్ సెట్

కంది, మార్చి 10 : సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా బీడీఎల్ – ఓబీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు.

సంగారెడ్డి, కోత్లాపూర్‌లోని జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు డిక్షనరీ, గ్రామర్ బుక్స్‌తోపాటు ఇడ్లీ కుక్కర్, ఫ్రిడ్జ్, మిక్సీ, క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థినులు అసోసియేషన్ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీడీఎల్ ఓబీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సాయిబాబా, సంతోష్‌కుమార్, కృపేందర్, యాదయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు వాసుగౌడ్, ఎర్రోళ్ల నర్సింలు, టీఆర్ఎస్‌కేవి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌కు ఫ్రిడ్జ్ అందజేస్తున్న బీడీఎల్ ఓబీసీ అసోసియేషన్ సభ్యులు

వైభవంగా మహాదేవుని రథోత్సవం

సిర్గాపూర్, మార్చి 10: మండలంలోని గోసాయిపల్లి గ్రామ శివారులో వెలిసిన మహాదేవుని ఉత్సవాలు ఆదివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా మహా రథోత్సవం జరిగింది. కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని గ్రామస్తులతో కలిసి రథాన్ని లాగారు. అనంతరం గట్టుపై వెలిసిన మహాదేవునికి భూపాల్‌రెడ్డి పూజలు చేసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, రాంసింగ్, సాయాగౌడ్, నాయకులు రాములు, శ్రీను పాల్గొన్నారు.

గోసాయిపల్లి జాతరలో రథాన్ని లాగుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎంపీపీ

వీరభద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రాయికోడ్, మార్చి 10 : అమావాస్యను పురస్కరించుకొని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మండల కేంద్రమైన రాయికోడ్ వీరభద్రేశ్వర స్వామి ఆలయం లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమర్చనలు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజుపాటిల్ భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్‌పాటిల్, మాజీ డీసీఎంఎస్ సిద్దన్నపాటిల్, మాజీ ఎంపీపీ అధ్యక్షురాలు శారాధబాయి, మాజీ సర్పంచ్‌లు సంగమేశ్వర్‌పాటిల్, కేదారినాథ్ పాటిల్, సుభాష్‌పాటిల్, యాద్దన్న, ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, నల్లంపల్లి పీఏసీఎస్ చైర్మన్ నాగిశెటి పాటిల్ ఉన్నారు.

వైభవంగా వసంతోత్సవం

అమీన్‌పూర్, మార్చి 10: మూడు రోజులుగా జరగుతున్న బీరంగూడ బ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మల్లికార్జునస్వామి వారికి నిత్య పూజలో భాగంగా ఆదివారం ఉదయం రుద్రాభిషేకం, సహస్రనామ పూజా కార్యక్రమాలతోపాటు చివరి రోజు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం శివ సహస్రనామ స్తోత్ర పారాయణం, స్వామి వారికి భస్మాలంకరణ, బిల్వార్చన, పల్లకీ సేవ, మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వినియోగం వంటి పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బైస సుధాకర్, కమిటీ సభ్యులు ఎల్కర్తి మల్లేశ్‌యాదవ్, కొల్లి మల్లేశ్, దండు నిర్మలాదీపక్, మహిపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ జాతరకు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు హాజరయ్యారని, ఎక్క డా ఎలాంటి అపశృతి జరగకుండా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించామని నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.



స్వామివారికి వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

మహిళా అభ్యున్నతికి కృషి చేయాలి

రామచంద్రాపురం, మార్చి 10: మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తెల్లాపూర్ మున్సిపాల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య విభాగం మహిళా సిబ్బంది, మెప్మా ఆర్పీలను శాలువాలతో సత్కరించి వారికి బట్టలు, ఆరోగ్య కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్లు చిట్టి, మంజుల, శ్రీశైలం, రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

నేటి నుంచి కుష్టు రోగుల గుర్తింపు

న్యాల్‌కల్, మార్చి 10: జాతీయ కుష్టు రోగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి కుష్టు రోగుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్టు మండలంలోని మిర్జాపూర్(బి) ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నృపేన్ చక్రవర్తి తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 24వరకు ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి కుష్టు రోగుల గుర్తింపు సర్వే చేపడుతారన్నారు. రోగులను గుర్తించేందుకు ఆయా తేదీల్లో సర్వే కోసం వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

దుమ్ముతో ప్రయాణం సాగేదెలా?

- రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, ఇసుక
- 65వ నంబర్ జాతీయ రహదారిపై దుమ్ము-ధూళి
- కండ్లలో పడుతుండడంతో అదుపుతప్పుతున్న వాహనాలు
- రహదారి నిర్వహణను పట్టించుకోని అధికారులు

పోచారం చౌరస్తా ముందు అధ్వానంగా జాతీయ రహదారి

పటాన్‌చెరు, మార్చి 10: జాతీయ రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ద్విచక్రవాహనదారులు భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నారు. 65వ నంబర్ హైవేపై రోడ్డుపక్కన ఏర్పడిన దుమ్ము, దూళి, మట్టి రహదారిని ఆక్రమిస్తున్నది. రోడ్డుపై ఉన్న ఇసుక ఎగిరి ప్రయాణికుల కండ్లలో పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో పలువురు తీవ్ర గాయాలపాలు కాగా, కొందరు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.

తరచూ ప్రమాదాలు

- పటాన్‌చెరు పట్టణం నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు ముంబై జాతీయ రహదారి నిర్వహణ వైఫల్యంతో రోడ్డుకు ఇరువైపులా ఇసుక, మట్టి, కంకర రాళ్లు పేరుకుపోయాయి. రోడ్డుపై 10ఫీట్ల వరకు మట్టి, ఇసుక కనిపిస్తున్నది. ద్విచక్ర వాహనదారులు ఆ మట్టి, ఇసుకలో అదుపుతప్పి కిందపడిపోవడం సాధారణంగా మారింది.
- పోచారం చౌరస్తానుంచి నక్కవాగు వరకు ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. స్వీట్‌హోట్ హోటల్‌నుంచి హరి దోశ సెంటర్ వరకు రోడ్డు గుంతలమయమైంది. ఇసుక పేరుకుని పోవడంతో వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.
- ముత్తంగి గ్రామ సమీపంలో, పెట్రోల్ పంపు వద్ద, ముత్తంగి చర్చి ముందు ఇసుక దిబ్బలు దర్శనమిస్తున్నాయి. వీటి కారణంగా వాహనదారుల కండ్లలో ఇసుక, మట్టి, దుమ్ము పడటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఇస్నాపూర్ ఆంధ్రాకాలనీ నుంచి గురుకుల పాఠశాల, లక్డారం గేటు వరకు మట్టితో రోడ్డు కమ్ముకుపోయింది. లక్డారం గేటు వద్ద క్రషర్ల నుంచి వచ్చే వాహనాలతో జాతీయ రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లపై కంకర పడటంతో అధ్వానంగా మారాయి.
- పటాన్‌చెరు పట్టణంలో రిలయన్స్ పెట్రోల్ పంపు ఎదుట రెడీమిక్స్ వాహనాల వల్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. పోచారం చౌరస్తాలో నిర్మాణ కంపెనీలకు సంబంధించిన వాహనాల్లో వస్తున్న మట్టి, కంకర, ఇసుక జారిపడి రోడ్డును సగం ఆక్రమించాయి. రోడ్డు అధ్వానంగా మారుతున్న సంబంధిత అధికారులు మరమ్మతులకు ఆసక్తి చూపకపోవడం, రహదారి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరలోనే జాతీయ రహదారి విస్తరణ ఉంటుందని చెబుతూ మరమ్మతులు చేయడం లేదు.

వ్యర్థ జలాలతో విద్యార్థుల ఇక్కట్లు

నస్తీపూర్ శివారులోని బీసీ వసతిగృహం సమీపంలో వ్యర్థజలాలు

హత్నూర,మార్చి 10: వ్యర్థజలాల దుర్వాసనను భరించలేకపోతున్నామని వసతిగృహం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఓసారి ఇటువైపు చూడండని వేడుకుంటున్నారు. హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు దౌల్తాబాద్ చౌరస్తా వద్దగల దుకాణాలు, హోటళ్ల నుంచి విడుదల అవుతున్న వ్యర్థ జలాలను పైప్‌లైన్ ద్వారా వసతిగృహం సమీపంలో వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పరీక్షల సమయం కావడంతో చదువుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థ జలాలను మరో చోటుకు మళ్లించాలని కోరుతున్నారు.

బీజేపీ మండల కమిటీ ఏర్పాటు

ఝరాసంగం, మార్చి 10: బీజేపీ ఝరాసంగం మండల స్థాయి కమిటీ నియామకం ఆదివారం మండల అధ్యక్షుడు బంటు విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. కార్యదర్శులుగా ఎల్గోయి బస్వారాజ్, చిల్కేపల్లి గోపాల్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, యాదవరెడ్డి, పాండు, ప్రశాంత్, కార్యదర్శులుగా అనిల్ పాటిల్, రవి, రమేశ్, అశోక్, నర్సింహులు, విశ్వనాథం, కోశాధికారిగా తమ్మలి మహేశ్, యువ మోర్చ మండల అధ్యక్షుడు వినోద్, కిసాన్ మోర్చ వేంకటేశం, గిరిజన మోర్చ గణేశ్, ఎస్సీ మోర్చా రమేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు.

ఉపవాసాలు భగవంతుడికి ప్రీతిపాత్రం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 10: ఉపవాసాలు భగవంతుడికి ప్రీతిపాత్రమైన కానుక అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రంజాన్ మాసం ఉపవాసదీక్షల కాలమానిని ముస్లిం మతపెద్దలతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసే ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. వేసవిలో వస్తున్న ఉపవాస దీక్షలు చక్కగా కొనసాగేలా అల్లా ఆశీర్వదించాలని కోరారు. అన్ని మతాల్లో ఉపవాసాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద తాగునీటి వసతి, కరెంట్ సరఫరా, పరిశుభ్రత తదితర అంశాలను చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేశ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు అప్జల్, మెరాజ్‌ఖాన్, షకీల్ పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

మహిళల్లో ఆత్మస్థైర్యం నింపాలి

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

సంగారెడ్డి, మార్చి 10: మహిళల్లో ఆత్మస్థైర్యం నింపాలని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. వీరశైవ లింగాయత్ జిల్లా మహిళా సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని పోతిరెడ్డిపల్లి పీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ హాజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో మగవారితో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్ద శశికళ, గౌరవ అధ్యక్షురాలు మంజుల కౌలాస్, ప్రధాన కార్యదర్శి గొర్రెగట్టు శారధ, మహిళా దినోత్సవ కన్వీనర్లు అరుణ, కులాల్ కరుణ, కొంక రాజేశ్వర్, శివరాజ్ పటేల్, నవీన్ రామోజీ, లింగాయత్ సమాజం అధ్యక్షుడు మధుశేఖర్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, గౌరవ అధ్యక్షుడు శివచంద్రకుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో...

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ స్టడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సావిత్రీబాయిపూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జ్యోతి, అరుణ, లలిత, హేమలత, త్రివేణి పాల్గొన్నారు.

ఆందోళనకరంగా కాలుష్య జలాల ఊట

కాలుష్యకాసారంగా ఇస్నాపూర్ పెద్ద చెరువు

పటాన్‌చెరు, మార్చి 10: పాశమైలారం పారిశ్రామికవాడకు ఆనుకొని ఉన్న ఇస్నాపూర్ పెద్ద చెరువులో మండువేసవిలో ఎరుపు రంగు నీళ్లు పారుతున్నాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం పరిశ్రమలకు ఆనుకొని ఇస్నాపూర్ పెద్ద చెరువు ఉంది. ఈ చెరువులో ఊట ఊరినట్టు కాలుష్య జలాలు ఉబికి వస్తున్నాయి. నేరుగా చెరువు వైపు ఆ నీళ్లు పారుతున్నాయి.

అత్యంత కలుషిత నీటితో నిండిఉండే ఇస్నాపూర్ పెద్ద చెరువులో కాలుష్యజలాలు కలువడంపై ఇప్పటికే ఆ గ్రామ రైతులు అనేకసార్లు అభ్యంతరం తెలిపారు. ఫిర్యాదులు చేశారు. పీసీబీ అధికారులు కాలుష్య జలాలను నిలువరిస్తామని అనేకసార్లు హామీలు ఇచ్చారు. వర్షాలు ఆగి ఐదు నెలలు అవుతున్నది. కానీ చెరువులో నీటి ఊటలు మాత్రం ఆగడం లేదు. ఈ రంగునీళ్లు బల్క్‌డ్రగ్, కెమికల్ ఇండస్ట్రీస్ నుంచి వస్తున్నాయనే అనుమానం స్థానికులకు ఉంది. ఈ రంగునీళ్లు వచ్చేప్రాంతంలో తవ్వకాలు చేస్తే రహస్య పైప్‌లైన్ జాడలు కూడా కన్పిస్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమలు దశాబ్దాలుగా కాలుష్య జలాలను ఇస్నాపూర్ పెద్ద చెరువులో కలుపుతున్నాయి. జిల్లా అధికారులు చెరువులో ఉన్న కలుషితాలను పరిశీలించి దానికి కారణమైన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఇస్నాపూర్ గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద చెరువు నీటిలో ప్రమాదకర రసాయనాలున్నాయని వాటిని పరీక్షించి ఫలితాలు తెలిపాలని కోరుతున్నారు.

ఇస్నాపూర్ పెద్ద చెరువులో ఎరుపురంగులో ఊటగా వస్తున్న నీరు →



వరికి మొగి పురుగు.. రైతుకు గుబులు

- జిన్నారం మండలంలో విజృంభిస్తున్న మొగిపురుగు
- ఇప్పటివరకు 120 ఎకరాలల్లో వరి పంటకు నష్టం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

జిన్నారంలో మొగి పురుగు సోకిన వరి పంట

జిన్నారం, మార్చి 10: యాసంగిలో వరి సాగుపై రైతులు పెట్టుకున్న ఆశలు మొగి పురుగు పీడతో నీరుగారుతున్నది. నివారించే ప్రయత్నాలు ఎన్ని చేస్తున్నా వరిలో ఎదుగుదల కనిపించడం లేదు. మొగి పురుగు వరి పైరును ఎదగకుండా చేస్తున్నది. వేర్లు కుళ్లి మొక్క ఎండిపోతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిన్నారం మండలంలోని నల్తూరు, సోలక్‌పల్లి, లక్ష్మీపతిగూడెం, ఊట్ల గ్రామాల్లో సుమారు 120 ఎకరాల్లో వరికి మొగి పురుగు సోకింది. మండల వ్యాప్తంగా యాసంగిలో 3,500 ఎకరాల్లో వరి సాగవుతుండగా పంట మార్పిడీ లేక మొగి పురుగు సోకుతోందని అధికారులు చెబుతున్నారు.

ఏళ్లుగా వరి సాగు..

జిన్నారం మండలంలో ఎక్కువగా వరి సాగు చేస్తుంటారు. వానకాలం, యాసంగిలోనూ వరి సాగుచేయడం సంప్రదాయంగా వస్తున్నది. పంట మార్పిడితోనే మొగి పురుగు వరికి సోకకుండా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొగి పురుగు సోకిన పొలం నుంచి మరోపొలంలోకి సోకుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు జాగ్రత్తల కోసం వ్యవసాయాధికారులను సంప్రదిస్తున్నారు.

మూడెకరాల్లో నష్టం వచ్చింది

నాకున్న నాలుగెకరాల పొలంలో వరి సాగు చేస్తున్నా. ఇందులో మూడెకరాలకు మొగి పురుగు రోగం వచ్చింది. నాట్లు వేసిన నాటి నుంచి వరిలో ఎదుగుదల లేదు. క్రమంగా ఎండిపోయింది. నాలుగెకరాల సాగుకు రూ.82 వేలు పెట్టుబడి అయ్యింది. ఇప్పటికే మూడు ఎకరాలు ఎండిపోవడంతో రూ.60 వేలు వేలు వృథా అయ్యాయి. మిగిలిన ఒక ఎకరం కాపాడుకుంటున్న.

- మహేందర్‌రెడ్డి, ఊట్ల

పంట మార్పిడి జరగాలి

దుక్కి దున్ని కొన్ని రోజులపాటు ఎండకు అలాగే ఉంచకుండా వెంటనే సాగు పనులు చేపట్టడం వల్ల భూమిలో ఉండే మొగి పురుగు వరికి సోకుతుంది. వాతావరణంలో మార్పులు, యూరియా ఎక్కువ వినియోగించడం వల్ల కూడా మొగి పురుగు సోకడానికి కారణాలు. మొగి పురుగు సోకిన వరికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును ఒక లీటర్ నీటిలో రెండు గ్రాములు వేసి పిచికారీ చేయాలి. లేదా కార్టాప్ గ్రాన్యూల్స్ ఒక ఎకరానికి ఎనిమిది కిలోలు చల్లాలి. వరి వేసి దానిని కాపాడుకునేందుకు నానా యాతన పడడం కంటే పంట మార్పిడి సరైన విధానం.

- రవీంద్రనాథ్‌రెడ్డి, వ్యవసాయాధికారి, జిన్నారం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఝరాసంగం, మార్చి 10 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి మంజూరైన రూ. 7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీసీ, ఎస్సీ కాలనీలలో ఎంపీటీసీ సంగీత గుండప్ప గ్రామస్తులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నందుమహారాజ్, కాంగ్రెస్ సినియార్ నాయకులు వీర్‌శెట్టి, శంకర్, రామప్ప, సాబేర్ మియా, బసంతి, బాబు మియా, విఠల్ పాల్గొన్నారు.

సావిత్రీబాయికి ఘన నివాళి

హత్నూర, మార్చి10: హత్నూర మండలం ముచ్చర్ల, గుండ్లమాచునూర్‌లో ఆదివారం సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగసంస్కర్త, ఉపాధ్యాయురాలు, రచయిత్రి అయిన సావిత్రీబాయి పూలే సమాజసేవకు ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయమొల్ల నర్సింగరాజు, నాయకులు శ్రీశైలం, నగేశ్, విజయ్‌కుమార్, అరుణ్, కిశోర్, కృష్ణ, విక్రం, మహేశ్, నాగరాజు, లోకేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన

వట్‌పల్లి, మార్చి 10: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వట్‌పల్లి వెంకట్ ఖ్వాజా ఆశ్రమంలో రెండో రోజు దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆశ్రమ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. ఆశ్రమ ప్రాంగణం దీపాలకాంతులతో విరాజిల్లింది. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా రుద్రహోమం

గుమ్మడిదల, మార్చి 10: బొంతపల్లి భద్రకాళి వీరభద్రస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం ఆలయ కార్యనిర్వాహణాధికారి శశిధర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దైవ దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు

ఆకట్టుకున్న ఒగ్గు కళా ప్రదర్శన

జిన్నారం, మార్చి 10: మండలంలోని ఊట్ల గ్రామంలో మల్లన్న ఉత్సవాలు యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు జాతరలో మల్లన్నకు నాగవెల్లి నిర్వహించారు. మల్లన్న చరిత్రను ఒగ్గు కథ రూపంలో ప్రదర్శించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై మల్లన్న, రేణుక ఎల్లమ్మ, నరసింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. జాతరకు హాజరైన భక్తులకు అన్నవితరణ చేశారు.

ఒగ్గు కథ చెబుతున్న కళాకారులు

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

బొల్లారం మార్చి 10: సీతారామచంద్ర స్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు బొల్లారం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి హాజరుకావాలని కోరుతూ వడక్‌పల్లి గ్రామస్తులు ఆదివారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు రామాలయంలో నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదగిరి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, ఆంజనేయులు, చంద్రయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న వడక్‌పల్లి గ్రామస్తులు

అపూర్వ సమ్మేళనం

న్యాల్‌కల్, మార్చి 10: మండలంలోని హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001–02 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 20 ఏండ్ల తర్వాత పాఠశాలలో పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు